వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 042
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
జనవరి 22, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# ఫైరింగ్ సాధనలో పోలీసులు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** వార్షిక ఫైరింగ్ సాధనలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి చెందిన పోలీస్ సిబ్బందితో పాటు శాంతి భద్రతలకు చెందిన పోలీస్ అధికారులు గత రెండు రోజులుగా ధర్మసాగర్ మండల కేంద్రం శివారు ప్రాంతంలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ సాధన చేస్తున్నారు.

(మిగితా 2లో..)


2లో..



# నిలువెత్తు బంగారం ఇచ్చిన.. సీపీఐ నేత నారాయణ

2లో..

- మేడారం సందర్శించిన సీపీఐ నేతలు
- నారాయణను సత్కరించిన రాష్ట్ర మంత్రి సీతక్క



# మేడారం-భక్తజనం

## జాతరకు ముందే తరలివస్తున్న భక్తులు



- బెల్లం, కోళ్లు, గొర్రెలకు విపరీతమైన గిరాకీ
- జాతర సమాచారానికి తొలిసారిగా వాట్సాప్ సేవలు
- 4వేల బస్సులను కేటాయించిన ప్రభుత్వం
- హెలికాప్టర్ సేవలను ప్రారంభించిన సీతక్క

మేడారం భక్తజనసంద్రంగా మారుతోంది. జాతరకు మరో వారం రోజుల గడువు ఉన్నప్పటికీ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్ల మొక్కులు చెల్లించుకుంటున్నారు. శని, ఆదివారాల్లో భక్తుల సంఖ్య ఆరు అంకెలకు చేరుతోంది. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడుతున్నారు. జాతర సమయం వరకు భక్తుల సంఖ్య దినదినాభివృద్ధి చెందుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో బెల్లం, కోళ్లు, గొర్లకు విపరీతమైన గిరాకీ పెరిగింది. జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు నిర్వహించనున్న గిరిజన మహా జాతరకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈసారి రికార్డు స్థాయిలో భక్తులు వస్తారనే అంచనాతో తెలంగాణ ప్రభుత్వం రూ.251 కోట్ల నిధులతో శాశ్వత నిర్మాణాలను పూర్తి చేశారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని తట్టుకునేలా క్యూలైన్లను వెడల్పు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకోసం ఆర్టీసీ నాలుగు వేల బస్సులను కేటాయించింది. అదే విధంగా జాతర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా తొలిసారిగా ప్రభుత్వం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. మేడారం విహంగ వీక్షణంతోపాటు, వివిధ ప్రాంతాలనుంచి మేడారం చేరుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ సేవలను మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. - వరంగల్ వాయిస్, మేడారం

వివరాలు2లో..




8లో..

# గోదావరి జలాలతో ములుగు సస్యశ్యామలం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

# మూడు నెలల్లో పనులు పూర్తి

- అభివృద్ధి పనులకు రూ.8.30 కోట్ల నిధులు
- పురోగతి పనులు పబ్లిక్ డొమైన్ లో ఉంచాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



8లో..



8లో..

# నిర్మాణంలో వేగం పెంచండి

☐ కుడా వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

# మేడారం.. భక్తజనం

- జాతరకు ముందే తరలివస్తున్న భక్తులు
- బెల్లం, కోళ్లు, గొర్రెలకు విపరీతమైన గిరాకీ
- జాతర సమాచారానికి తొలిసారిగా వాట్సాప్ సేవలు
- 4వేల బస్సులను కేటాయించిన ప్రభుత్వం
- హెలికాప్టర్ సేవలను ప్రారంభించిన సీతక్క



**వరంగల్ వాయిస్, మేడారం :** రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగనున్న గిరిజన మహాజాతర మేడారం భక్తజనసంద్రంగా మారుతోంది. గతంలో కాలినడక, ఎడ్ల బండ్లపై వచ్చిన భక్తులు నేడు కార్లు, హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారు. జాతర దగ్గరపడుతుండడంతో మేడారం వచ్చే భక్తుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. వివిధ వ్యాపారాలు నిర్వహించేవారు ఇప్పటికే మేడారంలో మకాం వేసి గుడారాలను నిర్మించుకుంటున్నారు. వారం.. పది రోజుల పాటు అక్కడే ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే మేడారంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

### 28నుంచి జాతర..

ఈ ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మేడారం జాతరకు గిరిజన పూజారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిరోజు జనవరి 28వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తేవడంతో జాతర ప్రారంభమవుతుంది. ఇదే రోజు గోవింద రాజులు, పగిడిద్ద రాజు నూతనంగా నిర్మించిన గద్దెపైకి చేరుకోనున్నారు. రెండో రోజు 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్టనుంచి సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకురానున్నారు. మూడో రోజు 30వ తేదీ శుక్రవారం కోట్లాదిగా తరలి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. నాలుగో రోజు 31వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలతోపాటు గోవింద రాజు, పగిడిద్ద రాజు వన ప్రవేశంతో జాతర ముగియనుంది.

### 4వేల ప్రత్యేక బస్సులు..

జాతర సమయం సమీపిస్తున్నందున అధికార యంత్రాంగం భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకోనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నాలుగు వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించారు. అడవిలో తాత్కాలిక వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక గ్రిడ్లను ఏర్పాటు చేశారు. ఎంతమంది భక్తులు వచ్చినా ఇబ్బంది కలగకుండా వేల మంది సిబ్బందితో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

### పేరుకే గిరిజన జాతర..

రెండేళ్లకోసారి నిర్వహించే జాతర వేడుకలు మాఘశుద్ధ పౌర్ణమికి ముందు నాలుగురోజులపాటు సమ్మక్క-సారలమ్మ జాతరను భక్తులు కోలాహలంగా జరుపుకుంటారు. పేరుకే గిరిజన జాతర అయినప్పటికీ అన్నివర్గాలకు చెందినవారు భక్తిశ్రద్ధలతో వనదేవతలకు పూజలు చేస్తారు. ఈనెల 28నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా తల్లులను దర్శించి మొక్కులు చెల్లించడానికి భక్తజనం సిద్ధమవుతున్నారు. వనదేవతలకు బెల్లం కొనుగోలు చేసి భక్తులు పంచిపెడుతున్నారు. దీనిని బంగారంగా భావించి అమ్మవార్లకు సమర్పించనున్న నేపథ్యంలో బెల్లందుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్ లో 10కిలోల బెల్లం ముద్దలు రూ.500, కిలో అయితే రూ.55వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. కాకతీయుల కాలం నుంచి ఇప్పటి వరకు మేడారం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. ఈ జాతర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి కులమతాలకు అతీతంగా కోట్లాది మంది భక్తులను ఆకర్షిస్తోంది. దీంతో సమ్మక్క-సారక్కల త్యాగాలు, వీర చరిత్ర, గిరిజన సంస్క□తిని సజీవంగా నిలబెడుతోంది.

### మేడారంలో వాట్సాప్ సేవలు..

మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. భక్తులు 76589 12300 నంబర్‌కు 'Hi' అని మెసేజ్ పంపితే జాతరకు సంబంధించిన పూర్తి వివరాలు వాట్సాప్ ద్వార పొందేలా ఏర్పాట్లు చేసింది. జాతర రూట్ మ్యాప్, ట్రాఫిక్ అప్‌డేట్స్, పార్కింగ్, వైద్య కేంద్రాలు, స్నానఘట్టాలు తదితర సమాచారం నేరుగా వాట్సాప్‌లో లభించనుంది.



### అందుబాటులో హెలికాప్టర్ సేవలు..

మేడారంలోని సమ్మక్క-సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు ఏర్పాటు చేసిన హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రారంభించారు. బుకింగ్ వివరాలకు ఫొన్ 9676320139, 8530004309, 7660939509 లోగాని వెబ్‌సైట్ www.helitaxii.com లో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి రాష్ట్ర పర్యాటక శాఖ హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి మేడారం వరకు తిరిగి మేడారం నుంచి హనుమకొండకు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి రూ.31 వేలు టికెట్ ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి రూ.4,800 టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. హెలికాప్టర్ సేవలు నేటినుంచి ఈ నెల 31 వరకు కొనసాగుతాయని తెలిపారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గద్దెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 251 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

# నిలువెత్తు బంగారం ఇచ్చిన.. సీపీఐ నేత నారాయణ




- మేడారం సందర్శించిన సీపీఐ నేతలు
- నారాయణను సత్కరించిన రాష్ట్ర మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, మేడారం :** సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ గురువారం మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సీపీఐ శతవసంతాల బహిరంగ సభ, పార్టీ జాతీయ కార్యవర్గ, కౌన్సిల్ సమావేశాలలో పాల్గొన్న అనంతరం నారాయణ పార్టీ నాయకులతో కలసి మేడారం సందర్శించారు. తొలుత ములుగు జిల్లా కేంద్రంలో కె.నారాయణ రాష్ట్ర మంత్రి దనసరి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క నారాయణను శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తాడ్వాయి మండలంలోని మేడారాన్ని నారాయణ సందర్శించి లక్షలాది మంది దర్శించుకునే జాతర ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జాతర పునరుద్ధరణ పనులను పరిశీలించి, భక్తులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్లు ఖర్చు చేసి జాతర పునరుద్ధరణ పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సూచించారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర అయిన మేడారంకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం నిధులను కేటాయించక పోవడం సరికాదన్నారు. తెలంగాణలో జరుగుతున్న జాతర పట్ల కేంద్రం వివక్ష సరికాదన్నారు. సమ్మక్క-సారలమ్మలు స్వేచ్ఛా, సమానత్వం కోసం, శాంతి, ఐకమత్యం కోసం పోరాడిన వీరవనితలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయ సారధి, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్ కే బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ములుగు జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, నాయకులు గన్నారపు రమేష్, బాషబోయిన సంతోష్, దండు లక్ష్మణ్, ఓర్సు రాజు, అక్బర్ పాల్గొన్నారు.

### ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల ర్యాలీలో నారాయణ..

మేడారం సమ్మక్క సారలమ్మ సందర్శన, పర్యటనకు వెళుతున్న సీపీఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ నారాయణ ములుగు జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ములుగు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ర్యాలీ, ప్రదర్శనను చూసి ఆగి మద్దతు పలికారు. విద్యార్థులను పలకరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు విజయ సారధి, పంజాల రమేష్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, నాయకులు నేరాళ్ల జోసెఫ్, అనుముల రాజ్ కుమార్, దుర్గం శివకుమార్, కుమ్మరి రంజిత్, కొండగోర్ల సాయి కుమార్, చెన్నూరి రామ్ చరణ్, జాడి మహేష్, సునర్కని రణధీర్, చీల దేవేందర్, బోడ సాయి, కృష్ణ, రమ్య, సౌజన్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫైరింగ్ సాధనలో పోలీసులు

(2వ పేజీ తరువాయి..) ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు, డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఆర్ఐలు ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గోని వివిధ రకాల తూపాకులతో సాధన చేశారు. ఈ సందర్భంగా రాబోవు రోజుల్లో ఈ ప్రాంతాన్ని ఫైరింగ్ సాధన చేసేందుకుగాను మరింత అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో ముచ్చటించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ ఫైరింగ్ సాధనలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులను అందజేయడం జరుగుతుందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమములో డీసీపీలు అంకిత్ కూమార్, దార కవిత, రాజమహేంద్రనాయక్, ఏఎస్పీలు చేతన్, శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నేహ్రా, అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, రవి, రాయల ప్రభాకర్ రావు, శ్రీనివాస్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, జనవరి 22, 2026

# గెలిస్తే తండాలను పంచాయతీలుగా చేస్తా

◆ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని, వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే తండాలన్నింటినీ గ్రామ పంచాయతీలుగా మారుస్తానని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హామీ ఇచ్చారు. గురువారం పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డోర్నకల్‌ను మున్సిపాలిటీగా మార్చి, ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టానని ఆయన గుర్తు చేశారు. అయితే, కొందరి స్వార్థ రాజకీయాలు, కోర్టు కేసుల కారణంగా పూర్తి స్థాయిలో అభివృద్ధికి ఆటంకం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మడం లేదని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో తమ అభ్యర్థుల విజయం ఖాయమని పేర్కొన్నారు. బంకట్ సింగ్ తండాలో రేషన్ డీలర్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేయగా, రెడ్యానాయక్ వెంటనే స్పందించారు. ఎంఆర్ఓతో ఫోన్లో మాట్లాడి, తండాకు రెగ్యులర్ డీలర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా, నల్లా పన్ను లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో 1వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కొండేటి హేమ చంద్రశేఖర్ పేరును రెడ్యానాయక్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. పట్టణాధ్యక్షులు కత్తెరసాల విద్యాసాగర్, బాషిపంగు గోపి, సర్పంచ్ బానోతు రంగమ్మ పాండునాయక్, యశోదర్ జైన్, మన్యు పాట్ని, బొరగల్ల శరత్, కొత్త వీరన్న, మైనార్టీ నాయకులు గౌస్, కందుల మధు, కొత్త రాంబాబు, గణేష్ ఠాకూర్, రహీం పాషా, పచ్చిపాల మల్లేశం, నాగేందర్, మంద వీరన్న, సూర మధు, రాము, రమేష్, మాతంగి అనిల్ కుమార్, డీసీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చిలుక ఇందిరకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక ఎక్సైజ్ కాలనీలో దివంగత చిలుక ఇందిర సంవత్సరీక (ప్రథమ వర్ధంతి) కార్యక్రమం ఆమె కుమారుడు డాక్టర్ కిరణ్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి 'వరంగల్ వాయిస్' దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి హాజరై ఇందిర చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిలుక ఇందిర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు శ్రేయోభిలాషులు పాల్గొని ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు.

# రేపు 'మెగా పేరెంట్స్ మీటింగ్'




**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 23న భారీ స్థాయిలో 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్' నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు విద్యార్థుల ప్రగతిపై చర్చించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కళాశాలలో చదివి, ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించనున్నారు. ఇది ప్రస్తుత విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుందని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు, ఇంటర్ బోర్డు కల్పిస్తున్న అత్యాధునిక వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. వచ్చే నెలలో జరగనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొంటారని, విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

# 'ఆరోగ్యదర్శిని' సంచిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రముఖ హోమియోపతి వైద్య పక్షపత్రిక 'ఆరోగ్యదర్శిని' 11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ఆవిష్కరించారు. దేవ్స్ హోమియోపతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మురళి ముఖ్య అతిథిగా హాజరై ఈ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళి మాట్లాడుతూ.. ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో 11 ఏళ్లుగా ఆరోగ్యదర్శిని పత్రికను నిర్విరామంగా నడపడం గర్వకారణమని ప్రశంసించారు. సామాన్య ప్రజలకు హోమియోపతి చికిత్సపై అవగాహన కల్పించడంలోనూ, ఈ వైద్య విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ఈ పత్రిక విశేష కృషి చేస్తోందని ఆయన కొనియాడారు. పత్రిక ఎడిటర్ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ.. హోమియోపతి గొప్పతనాన్ని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ పత్రికను ప్రారంభించామన్నారు. గత 11ఏళ్లుగా తమను ప్రోత్సహిస్తున్న పాఠకులకు, సహకరిస్తున్న మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజ్ఞానాత్మక కథనాలతో పత్రికను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్స్ హోమియో కాలేజీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మైనారిటీ బాలికల గురుకులంలో ప్రవేశాలు

పోస్టర్ ఆవిష్కరించిన ప్రిన్సిపాల్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ములుగు జిల్లా దేవగిరి పట్టణంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి, ఇతర తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల ప్రవేశాల కొరకు గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదవ తరగతిలో ప్రవేశాల కోసం కేటాయించిన సీట్ల వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. మైనారిటీలు: ముస్లింలు (51), క్రిస్టియన్లు (05), జైనులు (01), సిక్కులు (01), బౌద్ధులు (01), పార్శీలు (01), ఇతర కేటగిరీలు: బీసీలు (10), ఎస్సీలు (05), ఎస్టీలు (03), ఓసీలు (02) సీట్లుగా ఉన్నాయి. 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి కేవలం ముస్లిం మైనారిటీ బాలికలు మాత్రమే అర్హులని ఆమె స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్: http://tgmreis.telangana.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. పూర్తి వివరాల కోసం 93980 19134, 73961 94275, 97019 07575 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి మక్బూల్ పాషా, ఎండి సర్వర్ అహ్మద్, ఎండి హాజీ పాషా, ఎస్.కె ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశువైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చౌటపెల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరం, మేలుజాతి దూడల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మట్టపెల్లి వెంకటేశ్వర్ రావు, ఉపసర్పంచ్ పెసరు దర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్య అధికారి డాక్టర్ రాజు మాట్లాడుతూ.. పాడి పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా కేవలం ఆడ దూడలు మాత్రమే పుట్టేలా చేసే 'లింగ నిర్ధారణ చేసిన వీర్యం' ప్రస్తుతం అందుబాటులో ఉందని, రైతు సోదరులు దీనిని సద్వినియోగం చేసుకొని పాడి సంపదను వృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరానికి మొత్తం 117 పశువులు రాగా, వాటికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 54దూడలకు నట్టల నివారణ మందులు, క్యాల్షియం లవణ మిశ్రమం పంపిణీ. ఎదకు రాని 29 పశువులకు పరీక్షలు, 7 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 14 పశువులకు సాధారణ అనారోగ్య సమస్యలకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా గోపాలమిత్ర సూపర్వైజర్ కె.రఘువీర్, గోపాలమిత్రులు టి.ఉపేందర్, పి.వెంకటేశ్వర్లు, డి.కుమారస్వామి, వార్డు మెంబర్ గౌరారపు నర్సింహా స్వామి, పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# త్వరలోనే ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు

• కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతనంగా వెలుస్తున్న కాలనీల ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. గురువారం ఆయన మంకీ ఫుడ్ కోర్ట్, ఉప్పరోనికుంట, మంగలి కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలు తమ బాధలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఫ్లోరైడ్ నీటిని వాడటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, జుట్టు రాలిపోవడంతో పాటు ఇతర సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కార్పొరేటర్, మిషన్ భగీరథ నీటిని త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ బాజ్ పేయ్ ల సహకారంతో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు రవి తెలిపారు. మంకీ ఫుడ్ కోర్ట్ సమీపంలో 14 కోట్ల రూపాయల నిధులతో భారీ వాటర్ ట్యాంక్ (రిజర్వాయర్) నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రానున్న కొన్ని నెలల్లోనే ఈ పనులు పూర్తి చేసి, కాలనీలకు మంచినీటి సరఫరాను ప్రారంభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు చుంచ పాపయ్య, శ్రీపాద హరిప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, బొద్దుల పురుషోత్తం, మారపాక ముఖేష్, చిరంజీవి, సురేష్, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, ఆవునూరి రమేష్, సుధాకర్, నాగపురి రవిచంద్ర, మండ కోటేశ్వర్, కటకం రాధిక, ఉల్లి కవిత, గుళ్ళపల్లి కరుణ, మాసాడి స్వాతి, పద్మ, సప్న, శ్రీపాద స్వప్న, కుసుమ, నివేదిత, ఆదాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, జనవరి 22, 2026

# ఉపాధి హామీ పనులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని అప్పయ్యపల్లి గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్, ఉప సర్పంచ్ కనపర్తి వినయ్ కుమార్ కలిసి ఘనంగా ప్రారంభించారు. రైతుల పంట పొలాలకు సాగునీరు సజావుగా అందేలా చూడటమే లక్ష్యంగా, పొలాలకు వెళ్లే ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, మొలచిన చెట్లు, మట్టిని తొలగించే పనులను చేపట్టారు. కాలువలను శుభ్రం చేయడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని, రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పనులను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సర్పంచ్ పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతతో సాగాలని, రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడే విధంగా కాలువను తీర్చిదిద్దాలని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్ రాజశ్రీ, పంచాయతీ కార్యదర్శి చంద్రగిరి రాకేష్, వార్డు మెంబర్ ఎలుకపెల్లి సంధ్య-నవీన్, కారోబార్, స్థానిక రైతులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర గిరిజన విద్యుత్తు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్, విద్యుత్తు ఉద్యోగ సంఘ ప్రతినిధులతో కలిసి డైరీని ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రగతిలో, ముఖ్యంగా విద్యుత్తు రంగంలో గిరిజన ఉద్యోగులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని ఆయన కొనియాడారు. కష్టపడి పనిచేసే ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిరిజన విద్యుత్తు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గిరిజన విద్యుత్తు ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, విద్యుత్తు శాఖకు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే డోర్నకల్ అభివృద్ధి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని 7వ వార్డు పరిధిలో నూతనంగా నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ పనులకు గురువారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ప్రత్యేక కృషితో పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పట్టణవ్యాప్తంగా మొత్తం 15 కోట్ల రూపాయల వ్యయంతో సైడ్ డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పూర్తయిన పనుల పట్ల ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని, రాబోయే రోజుల్లో పట్టణ రూపురేఖలు మారుస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. మాద శ్రీనివాస్, మాజీ పట్టణాధ్యక్షులు తారా చంద్, సుశీల్ జైన్, దాసరి నాని, అబ్రహం, రామారావు, వీరస్వామి, రాంబాబు, అశ్వక్, భద్రు, పాషా, కృష్ణ పాల్గొన్నారు.

# గీత వృత్తిని కాపాడుకుందాం.. సమస్యలపై పోరాడుదాం

● బీసీ హక్కుల సాధన సమితి పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వృత్తి పరిరక్షణ కోసం గీత పనివారంతా ఐక్యంగా పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో గీత పనివారల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బైరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామిలతో కలిసి ఆయన 'గీత పనివారల సంఘం - 2026' క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. రెండేళ్లు గడుస్తున్నా వాగ్దానాలు నెరవేరకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రపంచీకరణ విధానాల వల్ల గీత, చేనేత, మత్స్య, రజక వంటి కులవృత్తులన్నీ విధ్వంసమయ్యాయని, పాలకులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలనే ఆలోచన లేదని విమర్శించారు. స్వాతంత్ర సమరయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం నిజాం కాలంలోనే "గీసేవాడిదే చెట్టు" అనే నినాదంతో గీత కార్మికులను ఏకం చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట ఫలితంగానే నేడు సహకార సంఘాలు, ఎక్స్ గ్రేషియా వంటి హక్కులు లభిస్తున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ. 12 కోట్ల ఎక్స్ గ్రేషియా బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. గీత కార్మికులందరికీ రక్షణ కిట్లు పంపిణీ చేయాలి. వృత్తిని కోల్పోయిన వారికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలి. ఈ కార్యక్రమంలో పల్లె రాజుగౌడ్, పట్టాపురం ఏకాంతం గౌడ్, చిర్ర శ్రీనివాస్ గౌడ్, పెద్దగాం మధుకర్, అనంతుల రమేష్ గౌడ్, అర్జున్, చెలుకల రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్నులు 100శాతం వసూలు చేయాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రధాన ఆదాయ వనరులైన ఇంటి పన్నులు, నల్లా పన్నుల వసూలులో పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి అలసత్వం వహించకూడదని జిల్లా పంచాయతీ అధికారి (డీపిఓ) కల్పన ఆదేశించారు. గురువారం పర్వతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ శేషు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యదర్శుల సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15 నాటికి మండలంలోని అన్ని గ్రామాల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని టార్గెట్ విధించారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు చట్ట పరిధిపై అవగాహన కల్పిస్తూ, సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. పన్నుల వసూలులో ఎంపీఓ నిర్దేశించిన 85 శాతం లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసిన ముగ్గురు కార్యదర్శులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. సీకే తండా, గుగులోత్ తండా, అనంతారం గ్రామాలకు చెందిన కార్యదర్శులు తమ విధుల్లో చూపిన చొరవకు గుర్తింపుగా ఎంపీఓ శేషు సొంతంగా సమకూర్చిన బహుమతులను డీపీఓ కల్పన చేతుల మీదుగా అందజేసి, వారిని ఘనంగా సత్కరించారు. విధుల్లో ఒకరికొకరు స్నేహపూర్వక పోటీతత్వంతో పనిచేస్తూ మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని డీపీఓ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడలు మన సంస్కృతికి వెన్నుముక

## వరికోల్ సర్పంచ్ కుమారస్వామి



**వరంగల్ వాయిస్, నడికూడ :** గ్రామీణ క్రీడలు మన సంస్కృతికి వెన్నుముక లాంటివని, ఇవి కేవలం వినోదం కోసమే కాకుండా గ్రామంలో ఐక్యతను పెంపొందిస్తాయని వరికోల్ సర్పంచ్ దొగ్గెల కుమారస్వామి అన్నారు. నడికూడ మండలం వరికోల్ గ్రామంలో 'సీఎం కప్' క్రీడల ఎంపికల సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నేటి తరం యువత స్మార్ట్ ఫోన్లకే పరిమితమవుతూ శారీరక దృఢత్వాన్ని దెబ్బతీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలంటే క్రీడలే సరైన మార్గమని పేర్కొన్నారు. ఆటల వల్ల రక్త ప్రసరణ మెరుగుపడటమే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. మన ఊరి నుండి జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. 2036 ఒలింపిక్స్‌ను లక్ష్యంగా చేసుకుని తెలంగాణ ప్రభుత్వం ఈ క్రీడలను రూపొందించిందని తెలిపారు. "గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు" అనే నినాదంతో 46 క్రీడాంశాల్లో ఈ పోటీలు ఐదు అంచెల్లో (పంచాయతీ నుంచి రాష్ట్ర స్థాయి వరకు) జరుగుతాయని వివరించారు. క్రీడాకారుల పారదర్శకత కోసం డిజిటల్ గుర్తింపు కార్డులు కూడా అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎస్జీఎఫ్ఐ నడికూడ సెక్రెటరీ సుభాష్ కుమార్, ఉపాధ్యాయులు తిరుపతి, రజనీకాంత్, జయశ్రీ, సునయన, మాధవి, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కేయూలో 24న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా జనవరి మొదటి శనివారం ఈ వేడుకను నిర్వహించడం కళాశాల ఆనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సమ్మేళనం కేవలం కలయిక మాత్రమే కాకుండా, ప్రస్తుత విద్యార్థినిల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎలా సాధించాలి? మారుతున్న టెక్నాలజీ ట్రెండ్స్ ఏమిటి? అనే అంశాలపై పూర్వ విద్యార్థులు అవగాహన కల్పించనున్నారు. ప్రముఖ కంపెనీల ప్లేస్‌మెంట్స్ కోసం ఎలా సన్నద్ధం కావాలి, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలపై తమ అనుభవాలను పంచుకోనున్నారు. ఈ కార్యక్రమం 24న ఉదయం 10 గంటలకు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో సమ్మేళన కన్వీనర్ పి.వి. వైష్ణవి, డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ ఎం.ఇస్తారి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎం.సదానందం, అకాడమిక్ కోఆర్డినేటర్లు డాక్టర్ టి.అర్చన, ఎం.వేణుగోపాల్ రెడ్డితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొనాలని ప్రిన్సిపాల్ కోరారు.

# ప్లాస్టిక్ రహిత మేడారమే లక్ష్యం

- 22 భాషల బ్యానర్‌తో వినూత్న ర్యాలీ
- ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర పవిత్రతను, అటవీ సంపదను కాపాడుకోవడమే ధ్యేయంగా ప్రపంచ పర్యావరణ సంస్థ (డబ్ల్యూఈఓ) ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో వినూత్న అవగాహన ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారత రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో పర్యావరణ సందేశాలతో రూపొందించిన భారీ క్లాత్ బ్యానర్‌ను ప్రదర్శించి, ప్లాస్టిక్ రహిత జాతర కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ.. మేడారం వంటి పవిత్రమైన అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం ప్రకృతికి శాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సహకారం ఉంటేనే ప్లాస్టిక్ రహిత జాతర సాధ్యమవుతుందని, ఇలాంటి వినూత్న కార్యక్రమాలు భక్తులలో మార్పు తీసుకువస్తాయని అభినందించారు. సామాజికవేత్త, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. ఈ ఏడాది జాతరకు సుమారు 3 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒక్కో భక్తుడు సగటున 10 ప్లాస్టిక్ వస్తువులు వాడినా, అడవిలో 15 కోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అడవి తల్లిని కాలుష్య కాసారంగా మార్చకుండా, బాధ్యతగా ప్లాస్టిక్‌ను త్యజించాలని కోరారు. ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సీహెచ్.భద్ర మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా మేడారంలో ప్లాస్టిక్ నియంత్రణ కోసం తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. జాతరకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 22 భాషల బ్యానర్‌ను రూపొందించామని, ఇది పర్యావరణ పరిరక్షణ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ ర్యాలీలో కాకతీయ పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని.. "సేవ్ మేడారం.. క్లీన్ మేడారం " అంటూ చేసిన నినాదాలు ఆలోచింపజేశాయి. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు అడవిలో వదిలివేయకూడదని వారు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పిట్టల వెంకన్న, సంస్థ జాతీయ కార్యదర్శి సాగర్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ పటేల్, సుమెర్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల రాంప్రసాద్, దయాప్రసాద్, సామాజిక కార్యకర్త చంద్రప్రకాష్, నీలం యువరాజ్, రోషన్ గైక్వాడ్, బాగడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం 'ముఖ్యమంత్రి సహాయనిధి'

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుపేదల ఆరోగ్య భద్రతకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరంగా మారిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 66వ డివిజన్ హసన్‌పర్తి గ్రామానికి చెందిన పిథిమి నాగమణి కుటుంబ సభ్యులకు రూ.2,50,000 విలువైన ఎల్వోసీ కాపీని ఆయన అందజేశారు.గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న నాగమణికి హైదరాబాద్‌లోని నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిమిత్తం ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలు ఖర్చయ్యే వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు కావద్దని నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఎల్వోసీల ద్వారా నిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి, భారీ ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు బాధితురాలి కుటుంబ సభ్యులు సాష్టాంగ నమస్కారం చేసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, 66వ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్, గౌరిగా రాజు, జన్ను అశోక్, జన్ను రమేష్, రమంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజ మార్పునకు మార్క్సిజమే దిక్సూచి

- ఎంసీపీ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి
- పెట్టుబడిదారీ పాలకుల వల్లే ఆర్థిక అసమానతలు
- గిర్నిబావిలో రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు
- పార్టీ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** సమాజ పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా అంచనా వేసిన ఏకైక సిద్ధాంతం మార్క్సిజమేనని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. ఆర్థిక అసమానతలు పెరగడానికి పెట్టుబడిదారీ పాలకుల విధానాలే కారణమని, దోపిడీకి గురయ్యే శ్రామికులంతా ఐక్యమై ప్రజా పోరాటాలను నిర్మించడమే దీనికి ఏకైక ప్రత్యామ్నాయమని ఆయన పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా గిర్నిబావిలోని జీఆర్ బీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ప్రారంభమైన భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)–ఎంసీపీఐ(యూ) రాష్ట్ర స్థాయి సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ.. దేశంలో కుల, మత, ప్రాంతీయ మరియు ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్దిమంది వ్యక్తుల దగ్గరే సంపద పోగుపడుతోందని, శ్రామికులు ఎంత శ్రమించినా కనీస అవసరాలు తీరడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక ప్రలోభాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్నాయని, ఆ తర్వాత పెట్టుబడిదారులతో చేతులు కలిపి ప్రజలను దోచుకుంటున్నాయని రవి ధ్వజమెత్తారు. దారిద్ర్యం, నిరుద్యోగం, ఆకలి చావులకు కారణమవుతున్న ఈ విధానాలపై వర్గ సామాజిక పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీనియర్ నాయకులు కోట నరసింహారెడ్డి, వల్లెపు ఉపేందర్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. మొదటి రోజు శిక్షణా తరగతుల్లో భాగంగా "మార్క్సిజం అధ్యయనం–ఆచరణ: ఓంకార్ పాత్ర" అనే అంశంపై పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి ప్రతినిధులకు బోధించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ (అధ్యక్షత), నాగెల్లి కొమురయ్య, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, ఎన్.రెడ్డి హంస రెడ్డి, కుంభం సుకన్య, తుకారాం నాయక్, కుసుంబా బాబురావు, కనకం సంధ్య, తుడుం అనిల్ కుమార్, జబ్బార్ నాయక్, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, నర్ర ప్రతాప్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన 'సీఎం కప్' క్రీడలు




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో గ్రామ పంచాయతీ స్థాయి 'సీఎం కప్ – 2026' క్రీడా పోటీలు గురువారం ఉదయం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడోత్సవాన్ని నడికూడ ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ కుడ్ల మల్లయ్య (మహలాల్ రావు), పంచాయతీ కార్యదర్శి భిక్షపతి, మాజీ ఎంపీటీసీ దురిశెట్టి చంద్రమౌళి (చందు) కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. యువతీ యువకులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి నవీన్, వార్డు సభ్యులు తల్లా జ్యోతి, దుప్పటి సదానందం, కామిద్రి శంకర్, దుప్పటి మల్లేష్, గోనెల రమేష్, కాంగ్రెస్ నాయకులు రావుల సురేష్, తల్లపెల్లి యుగేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు నీరటి రజిత, క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆటల పోటీలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం చంద్రుపల్లి ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందడి మొదలైంది. జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు గురువారం ముందస్తుగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ ఉపసర్పంచ్ ఆలం స్వర్ణలత–శ్రావణ్, యూత్ అధ్యక్షుడు కొండగొర్ల సంతోష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు విద్యార్థులకు శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని తెలిపారు. విద్యార్థులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రఘునాయక్, శ్రావణ్ కుమార్, గ్రామ యూత్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు. క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు.

# వాటర్ డిస్పెన్సర్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండలంలోని వంగపహాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు హనుమకొండకు చెందిన స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ ముందుకొచ్చింది. సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలకు బహూకరించిన వాటర్ డిస్పెన్సర్‌ను గురువారం మండల విద్యాధికారి ఏ.శ్రీనివాస్ ప్రారంభించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను కూడా ఎంఈఓ శ్రీనివాస్ ఈ సందర్భంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఆటల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని, తద్వారా చదువుపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు, విద్యాధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్, ఉపాధ్యాయులు రాణి, వీరస్వామి, శ్రీదేవి, భాను శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా నాగులమ్మ జాతర

## ముస్తాబైన కొయ్యూరు ఆలయం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మల్హర్ మండలంలోని కొయ్యూరు సమీప నాగులమ్మ దేవాలయం వార్షిక జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. తాడిచర్ల ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తున్న ఏఎంఆర్ కంపెనీ సామాజిక బాధ్యతగా ఆలయ అభివృద్ధికి, జాతర నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఏఎంఆర్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ మరమ్మతులు, తాగునీరు మరియు ఇతర వసతులను కల్పించారు. జాతర సందర్భంగా భక్తులకు ఏఎంఆర్ కంపెనీ ఆధ్వర్యంలో నిరంతరాయంగా పులిహోర ప్రసాద పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మేడారం మహాజాతర సమయం కావడంతో, నాగులమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. మేడారం వెళ్లే భక్తులు నాగులమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన సర్పంచులు



**వరంగల్ వాయిస్, గణపురం :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గణపురం మండలంలోని గణపురం సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్, బుద్ధారం సర్పంచ్ విడిది శ్రీలత అశోక్ లను మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో జీఎస్ఆర్ ప్రత్యేకంగా గణపురం, బుద్ధారం సర్పంచులను మంత్రి సీతక్కకు పరిచయం చేశారు. గతంలో ఉన్న పరిచయాలతో మంత్రి సీతక్క ఈ ఇద్దరు సర్పంచులను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. గ్రామస్థాయిలో పారదర్శక పాలన అందిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సర్పంచులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యేతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గణపురం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు ఓరుగంటి కృష్ణ, వడ్లకొండ నారాయణ, చోటే మియా, దుర్గయ్య, మల్లికార్జున్, ఇతర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# కాజీపేట మైనారిటీ గురుకులంలో ప్రవేశాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల (బాలుర) కాజీపేటలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. 5,6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తనుగుల తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లు, బ్రోచర్లు, బ్యానర్‌ను ముస్లిం మత పెద్దలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ గురుకులాల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. మైనారిటీ వర్గాల తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం కింది ఫోన్ 79950 57960, 70360 35453 నంబర్లను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తనుగుల పేర్కొన్నారు.

# సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతా

■ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**వరంగల్ వాయిస్, సుబేదారి :** విశ్వవిద్యాలయాలలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న పార్ట్ టైమ్, కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయపరమైన సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన అధ్యాపకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ చింతం ప్రవీణ్, ఇతరులు తమ సమస్యలను వివరించగా మల్లన్న సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న విద్యార్థుల, అధ్యాపకుల సమస్యల మూలాలను తెలుసుకునేందుకు పార్టీ ఆధ్వర్యంలో త్వరలోనే 'విశ్వవిద్యాలయాల న్యాయ యాత్ర' చేపడతామని ప్రకటించారు. గతంలోనూ పార్ట్ టైమ్ అధ్యాపకుల ఉద్యమానికి అండగా నిలిచానని, ప్రొఫెసర్ల సస్పెన్షన్ వంటి అన్యాయమైన విషయాల్లో జోక్యం చేసుకుని న్యాయం కోసం పోరాడానని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ సునీత, డాక్టర్ చందూలాల్, డాక్టర్ వెన్నంపల్లి విజయకుమార్, డాక్టర్ తాళ్లపల్లి సంజీవ్, డాక్టర్ రచ్చ కళ్యాణి, డాక్టర్ హరిదాస్యం రమాదేవి, డాక్టర్ మంథని శంకర్, డాక్టర్ బాలు, డాక్టర్ సురేష్, డాక్టర్ చందర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఫరా ఫాతిమా, డాక్టర్ మాధవి, డాక్టర్ సదానందం, డాక్టర్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ బీసీ కుల ధ్రువీకరణపై హైకోర్టు కీలక తీర్పు

## బీసీల హక్కులకు లభించిన విజయం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన వెన్నపు రెడ్డి మోహన్ రెడ్డి నకిలీ బీసీ (గాండ్ల) కుల ధ్రువీకరణ పత్రం పొందిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు బీసీ వర్గాలకు లభించిన కీలక విజయమని కాళేశ్వరం బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు అడప సమ్మయ్య అన్నారు. గురువారం కాళేశ్వరం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, నిజమైన బీసీ వర్గాల హక్కులను పరిరక్షించిన గౌరవ హైకోర్టు న్యాయమూర్తులకు సమ్మయ్య హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో వాస్తవాలను వెలికితీసి స్పష్టమైన నివేదికలు అందించిన తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌తో పాటు, సంబంధిత తహసీల్దార్ల కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. హైకోర్టు ఆదేశాలు మరియు బీసీ కమిషన్ నివేదికల ఆధారంగా, నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో ఎన్నికైన వెన్నపు రెడ్డి మోహన్ రెడ్డి ఎన్నికను జిల్లా కలెక్టర్ తక్షణమే రద్దు చేయాలని అడప సమ్మయ్య డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్ల వల్ల నిజమైన బీసీ కుటుంబాలు రాజకీయంగా, సామాజికంగా తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే బీసీలకు నిరంతరం అన్యాయం జరుగుతూనే ఉంటుందని, బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ ఐక్య వేదిక గౌరవ సలహాదారులు మెంగాని అశోక్, ఉపాధ్యక్షులు గోర దేవయ్య, మాచర్ల కిరణ్, కార్యదర్శి దుది శ్రీనివాస్, కంకణాల బాపు, బొల్లం సురేష్, వార్డు సభ్యులు ఇమ్రాన్, శేఖర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సడవలి పాల్గొన్నారు.

# 'మైకోర్ సూపర్'తో పంటలకు బలం

## ధనుక డీజీఎం రాంబాబు



**వరంగల్ వాయిస్, పరకాల :** పంట మొక్కలలో బలమైన వేరు వ్యవస్థ అభివృద్ధికి, భూమిలోని పోషకాలను మొక్కలు గ్రహించేందుకు ధనుక కంపెనీ వారి 'మైకోర్ సూపర్' అద్భుతంగా పని చేస్తుందని ఆ కంపెనీ వరంగల్ ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాంబాబు తెలిపారు. జనగాం మండలం గానుగుపాడ్ గ్రామంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. రైతులు ప్రతి సంవత్సరం మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం పొలాల్లో పశువుల ఎరువు, కోళ్ల ఎరువు వాడకం తగ్గడం వల్ల భూసారం దెబ్బతిని పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అధిగమించేందుకు ధనుక కంపెనీ 100శాతం ఎండో మైకోరైజా కలిగిన 'మైకోర్ సూపర్'ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇది మొక్క వేర్లతో వేగంగా సంబంధం ఏర్పరచుకుని, పోషకాలను మరియు నీటిని గ్రహించే శక్తిని పెంచుతుంది. మొక్కలకు బయోటిక్, అబియోటిక్ ఒత్తిళ్ల నుంచి రక్షణ కల్పించి, పంటను ఆరోగ్యంగా ఉంచుతుంది.సాధారణ పంటలకు ఎకరానికి 4 కిలోలు, ఉద్యానవన పంటలకు 8 కిలోలు ఎరువుతో కలిపి చల్లుకోవాలి. నేలలో తేమ ఉన్నప్పుడు, పంట ప్రారంభ దశలో దీనిని వాడటం శ్రేయస్కరం. వరి పంటలో కాండం తొలిచే పురుగు నివారణకు మోర్టార్ (250 గ్రాములు), వివిధ రకాల తెగుళ్ల నివారణకు జానెట్ (400 మి.లీ) వాడాలని ఏరియా మేనేజర్ శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.ఈ విశ్వాస్, పరకాల సేల్స్ ఎగ్జిక్యూటివ్ కొత్త జితేందర్ రెడ్డి, ఎస్.ఓ ఆర్ చాంద్, ధనుక డాక్టర్లు నెక్కొండ నరేష్, సాయి కిషోర్, శ్రీకాంత్, ఏరియా డీలర్లు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో నిరుద్యోగుల గర్జన

• సీఎం రేవంత్ రెడ్డి తీరుపై ధ్వజం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏబీఎస్ఎఫ్, ఎమ్ఎస్ఎఫ్, ఎస్ఎస్ యూ విద్యార్థి సంఘాలు ధ్వజమెత్తాయి. గురువారం కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయం నుంచి సెకండ్ గేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మంద నరేష్, ఎమ్ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్, ఎస్ఎస్ యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. నేడు గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగులను విస్మరించి, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం దుర్మార్గమని మండిపడ్డారు. 'అభయహస్తం' హామీలన్నీ కేవలం ఓట్ల కోసమేనా అని వారు ప్రశ్నించారు. ప్రజా పాలన పేరుతో ప్రభుత్వం వంచనకు పాల్పడుతోందని, కొత్త నోటిఫికేషన్లు రాకపోగా ఉన్న ఆశలను ప్రభుత్వం అడియాశలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల రక్తం చూస్తున్న ఈ ప్రభుత్వానికి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నిరుద్యోగులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తక్షణమే నిర్బంధాలు ఆపి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు అడ్డా రాజేష్, ప్రధాన కార్యదర్శి రాయరాల నరసింహ, ఉపాధ్యక్షులు చల్ల శ్రీకాంత్, ఉదయ్, సాయి, చంటి, కళ్యాణి, ప్రసన్న, అపర్ణ, కృష్ణ, వేణి, పల్లవి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
గురువారం 22 జనవరి 2026
7




# ఇక రెగ్యులర్ ధరలకే టిక్కెట్లు

చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్‌గారు'. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అంతేకాదు, చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన మూవీగానూ రికార్డు సృషించింది. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.300కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. ఇన్ని రోజులు తెలుగు రాష్ట్రాల్లో పెంచిన టికెట్ ధరలు అమల్లో ఉండగా, ఇకనుంచి రెగ్యులర్ ధరకే టికెట్లు లభించనున్నాయి. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ మూవీకి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు టికెట్ ధరలు పెంచుకునేందుకు పది రోజులు అనుమతి ఇచ్చాయి. ఇప్పుడు ఆ గడువు ముగియడంతో సాధారణ ధరకే టికెట్లు లభించనున్నాయి. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో అలరిస్తున్న మూవీ నేటినుంచి మరింత ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందని చిత్ర వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. చిరంజీవి నటన, అనిల్ రావిపూడి టేకింగ్, భీమ్స్ మ్యూజిక్, చివరిలో వెంకటేశ్ మెరుపులు సినిమాను విజయపథంలో నడిపాయి. మరోవైపు ఈ మూవీ ఓవర్సీస్‌లోనూ అదరగొడుతోంది. ఇప్పటివరకూ 4.2 మిలియన్ డాలర్లు వసూలు చేసి 5 మిలియన్ క్లబ్ వైపు పరుగులు తీస్తోంది. చిరంజీవి సినీ ప్రయాణంలో అతిపెద్ద విజయంగా 'మన శంకరవరప్రసాద్‌గారు' నిలవడంపై పవన్ కల్యాణ్‌కు చెందిన పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, చిరు బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. ' ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన అనిల్ రావిపూడి గారికి ప్రత్యేక అభినందనలు. చిరంజీవి, వెంకటేశ్ ఒకే తెరపై కలిసి కనిపించడం ప్రేక్షకులకు నిజంగా అపూర్వ ఆనందాన్ని కలిగించింది. భీమ్స్ సిసిరోలియో అద్భుత సంగీతం, ప్రేక్షకుల హృదయాలకు చేరువయ్యే చిత్రాన్ని అందించిన నిర్మాతలు సాహు గారపాటి, సుష్మితకు ప్రత్యేక అభినందనలు అని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పేర్కొంది.




## చిరు మూవీలో కృతిశెట్టి

'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. . కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.

## హిందీలో సక్రాంతికి వస్తున్నాంలో రాశీఖన్నా

దక్షిణాదితోపాటు అటు హిందీలోనూ అప్పుడప్పుడూ అవకాశాల్ని అందుకుంటున్న రాశీఖన్నాకి అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించే అవకాశం సొంతమైనట్టు సమాచారం. తెలుగులో విజయవంతమైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని హిందీలో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా రీమేక్ చేస్తున్నారు. ఇందులో భార్య పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా, ప్రియురాలి పాత్రలో రాశీఖన్నా నటించనున్నట్టు సమాచారం. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్ర రాశి సొంతమైందన్నమాట.




## విశాల్ మూవీ మొగుడు ప్రోమో విడుదల

తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయిస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.




## బోర్డర్-2 విడుదలకు గల్ఫ్ దేశాలు నిరాకరణ ?



సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' జనవరి 23న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ వి□డియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్ , ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్` పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర' 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# గోదావరి జలాలతో ములుగు సస్యశ్యామలం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించి పంట పొలాలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) వెల్లడించారు. గురువారం ములుగు మండలంలోని జీవాంతరావుపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, ఇందిరమ్మ ఇల్లు, రూ.5 లక్షలతో నిర్మించిన హనుమాన్ టెంపుల్ ప్రహరీ, రూ.3.50 కోట్లతో నిర్మించిన పీడబ్ల్యూడీ ములుగు నుంచి గణేష్ పల్లి వయా జీవాంతరావు పల్లి వరకు డబుల్ లైన్ రోడ్డు డివైడర్ సెంట్రల్ లైటింగ్ పనులను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డిలతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ములుగు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా కొనసాగినప్పటికీ ఒక్క రూపాయి కేటాయించక పోవడంతో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోయానన్నారు. నేడు ప్రజా ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతూ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే బాధ్యత తనదని, ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి తెలిపారు. ములుగు నియోజకవర్గంలో సమ్మక్క సారక్క బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టు నిర్మించినప్పటికీ అప్పటి పాలకులు వారి ప్రాంతాలకు గోదావరి జలాలను పోయాయని, నేడు గోదావరి జలాలను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు తరలించి రెండు పంటలు పండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా మేడారంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో రూ.143 కోట్లతో లిఫ్ట్ ఏర్పాటు చేసి ములుగు మండలంలోని అన్ని ప్రాంతాలకు నీటిని తరలించే విధంగా ఆమోదం తెలుపడం జరిగిందన్నారు. రామప్ప నుంచి లక్నవరం సరస్సు కు గోదావరి జలాలు తరలించడానికి రూ.35 కోట్లు విడుదల అయ్యాయని అన్నారు. మేడారం చేరుకోవడానికి పర్యాటకులు ప్రస్తుతం జంగాలపల్లి మీదుగా రామప్ప చేరుకుంటున్నారని, పర్యాటకులు భక్తులు చుట్టూ తిరిగి వెళ్లకుండా ములుగు నుంచి ఇదే రహదారి గుండా రామప్ప వెళ్లడానికి రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రామప్ప సరస్సులో రూ.13 కోట్లతో ఐలాండ్ నిర్మించి శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి మేడారం మహా జాతరను పురస్కరించుకొని మహిళా సంఘాలకు చెందిన 560 మందికి ఆర్థిక సహాయం చేసి వివిధ వ్యాపారాలు కొనసాగించడానికి అవకాశం కల్పించామని, వెనుకబడిన ములుగు ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని వివరించారు. నాయకుడు అనే ప్రతి వ్యక్తి గెలిచినా, ఓటమి చెందినా ప్రజల మధ్య ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మహిళా భవన్ ప్రారంభం..**

ములుగు పట్టణ కేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్మించిన మహిళా కమ్యూనిటీ నూతన భవనాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకోసం పనిచేస్తుందని వివరించారు. మహిళల కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ మహిళా సంఘాల్లో చేరాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మహిళా సంఘాల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మూడు నెలల్లో పనులు పూర్తి

- అభివృద్ధి పనులకు రూ.8.30 కోట్ల నిధులు
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఎంపీ ఛాంబర్‌లో చీఫ్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధుల నుంచి మొత్తం రూ. 8.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల్లో పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో పనులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ నిధుల ద్వారా చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన పురోగతి వివరాలు తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలన్నారు. ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి టెక్నికల్ సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, విద్య వంటి రంగాలతో పాటు ప్రజలకు ప్రత్యక్షంగా మేలు చేసే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ కడియం కావ్య అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలోనే పనులు పూర్తయ్యేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారులు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, పెండింగ్ ప్రాజెక్టుల స్థితి, భవిష్యత్తులో అమలు చేయనున్న ప్రణాళికలను ఎంపీకి వివరించారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చీఫ్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకళ, కొట్యా నాయక్, బాబురావు, పంచాయతీరాజ్ అధికారులు ఆత్మా రామ్, రమేష్ బాబు, కిషన్, సతీష్ బాబు, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారి కిషన్, డీడబ్ల్యుఓ రాజమణి, మిషన్ భగీరథ అధికారి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ‘దోర్నాల’ దంపతుల ఉదారత

□ పద్మశాలి కళ్యాణ మండప నిర్మాణానికి విరాళం

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ భక్త మార్కండేశ్వర స్వామి పద్మశాలి కళ్యాణ మండప నిర్మాణానికి ప్రముఖ సేవా దృక్పథం కలిగిన దంపతులు, జనగామ పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు – అనితలు భారీ విరాళాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. శ్రీ భక్త మార్కండేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులుగా, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులుగా సేవలందిస్తున్న దోర్నాల వెంకటేశ్వర్లు, కళ్యాణ మండప నిర్మాణ పనుల కోసం రూ. 5,16,116లను అందజేశారు. ఈ విరాళంతో వారు పద్మశాలి కళ్యాణ మండపానికి ‘విశిష్ట మహారాజ పోషకులుగా’ నిలిచారు. కుల అభివృద్ధి కోసం, కళ్యాణ మండప ఏర్పాటు కోసం నిరంతరం శ్రమిస్తూ, ఆర్థికంగా అండగా నిలుస్తున్న దోర్నాల వెంకటేశ్వర్లు దంపతులకు పద్మశాలి సంఘం, కుల బాంధవుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ భక్త మార్కండేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ఈ కుటుంబం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలను మరెన్నో చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

# పర్యావరణ సంస్థ అధ్యక్షుడిగా నాగేంద్ర కుమార్



**వరంగల్ వాయిస్, ములుగు :** పర్యావరణ పరిరక్షణకు గత 14 సంవత్సరాలుగా పనిచేస్తున్న ప్రపంచ పర్యావరణ సంస్థ ములుగు జిల్లా నూతన అధ్యక్షుడిగా తాడువాయి పట్టణానికి చెందిన వార్డు మెంబర్ బొల్లు నాగేంద్ర కుమార్ ని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు భద్ర, జాతీయ కార్యదర్శి సాగర్ నియమించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం బొల్లు నాగేంద్ర వారి మిత్రబృందం అద్భుతంగా కృషి చేస్తున్నారన్నారు. కాలుష్య రహిత మేడారం నిర్మాణమే లక్ష్యంగా ఈనెల 28 నుంచి జరుగనున్న మేడారం మహా జాతరలో నూతన జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర కుమార్ సారధ్యంలో జిల్లా ఎస్పీ, కలెక్టర్ ని కలిసి జంపన్న వాగు వద్ద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ వేడుకగా భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించడానికి భారత రాజ్యాంగంలో గుర్తింపు పొందిన 22 భాషలలో రూపొందించిన ప్రపంచ పర్యావరణ సంస్థ క్లాత్ బ్యానర్ను జ్యూట్ బ్యాగులను పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జాతరలో మైకులలో పెద్ద మొత్తంలో ప్రచారం కల్పించి కాలుష్య తీవ్రతను తగ్గించడానికి ప్రపంచ పర్యావరణ సంస్థ పెద్ద ఎత్తున కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస పటేల్, జాతీయ యువజన కార్యదర్శి సుమేర్, జనగాం జిల్లా అధ్యక్షుడు యువరాజ్ తదితరులు పాల్గొని మేడారంలో జరిగే భారీ కార్యక్రమాలను అవగాహన ర్యాలీలను సదస్సులను జయప్రదం చేయాలని అందరికీ పిలుపునిచ్చారు.

# నిర్మాణంలో వేగం పెంచండి

□ కుడా వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పరిధి ఖిలా వరంగల్ లో కొనసాగుతున్న మోటు పనుల నిర్మాణంలో వేగం పెంచాలని కుడా వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం మోటు నిర్మాణ పనులతో పాటు భద్రకాళి మాడవీధుల నిర్మిత పనులను పరిశీలించిన వైస్ చైర్మెన్ వేగవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ మాట్లాడుతూ మోటు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హనుమకొండ పరిధి భద్రకాళి ఆలయంలో కొనసాగుతున్న మాడ వీధుల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సీపీఓ అజిత్ రెడ్డి, ఏసీపీ ప్రశాంత్, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com